క్లుప్తంగా

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం ప్రభావతిని సన్మానిస్తున్న ఎంఈఓలు

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు టీ ప్రభావతిని పలువురు ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓలు శైలజ, చంద్రశేఖర్‌తో పాటు ఆమెను పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు

ఎస్ఈసీ సభ్యులుగా దామోదర్ రెడ్డి



వాకాడు: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొడవలూరు దామోదర్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి కమిటీలో స్థానం లభించింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన కొండవలూరు దామోదర్‌రెడ్డి ఎస్ఈసీ సభ్యులుగా నియమితులయ్యారు.

నాగులపాడును పంచాయతీ చేయాలి

దక్కిలి: మండలంలోని పలుగోడు పంచాయతీలో ఉన్న నాగులపాడు గ్రామాన్ని కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేసేందుకు ఆ గ్రామ సర్పంచ్ రత్నయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ శనివారం పలుగోడు సచివాలయం వద్ద బహిరంగ గ్రామ సభ ఏర్పాటు చేశారు. నాగులపాడు పంచాయతీ ఏర్పాటుకు 104 మంది ఆమోదించారని కార్యదర్శి వినోద్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని మతకాముడి గ్రామంలో ఉన్న సీనియర్ నాయకులు ధనుంజయ రెడ్డి తండ్రి రఘురాంరెడ్డి మృతి చెందడంతో శనివారం వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, గాలి మల్లికార్జున్‌రెడ్డి, శిరసనం బేడు మీరా రెడ్డి, హేమ శంకర్, మతకాముడి దేవేందర్ రెడ్డి నాయకులు భౌతికకాయాన్ని నివాళులర్పించి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన చిందేపల్లి



పెళ్లకూరు: రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని శనివారం వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులో అరెస్టు చేసి బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు.

ఎస్ఈసీ సభ్యుడు వేమారెడ్డికి సత్కారం



వేమారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

చిల్లకూరు: మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులవడంతో ఆయన్ను మండల నాయకులు సత్కరించారు. మండలంలోని మోమిడి గ్రామంలోని ఆయన నివాసంలో శనివారం బల్లవోలు గ్రామానికి చెందిన చెంచుకిరణ్ శివ, సురేష్, చింతవరానికి చెందిన జోగి అంకారావు, అంకయ్య, తదితరులు పుష్ప గుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు.

శాకాంబరిగా శ్రీవారు

సళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరాలయం వీధిలో వెలసిన శ్రీ మద్వేంకట రామ్మూర్తుల స్వామి వారి దేవస్థానంలో పెరటాశి నెల మూడ వ శనివారం సందర్భంగా స్వామివారిని కూరగాయలు, పండ్లతో శాకాంబరీ అలంకారంతో అలంకరించారు.

చికెన్ ధరలు		05-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	138
లేయర్ లైవ్	:	117
బ్రాయిలర్ చికెన్	:	246
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	270
లేయర్ చికెన్	:	200

ఇసుకాసురులు

- పొర్లుకట్టలు సైతం తెగ్గొట్టిన వైనం
- విచ్చలవిడిగా ఇసుక అక్రమ తరలింపు
- నదిలో బయటపడుతున్న కళేబరాలు
- ఆగని కూటమి నేతల దందా



చిగురుపాడు సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

నాయుడుపేటటౌన్: ఇసుకాసురులు స్వర్ణముఖిని చెరబట్టారు. యథేచ్ఛగా పొర్లుకట్టలను ధ్వంసం చేసి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతమైన అయ్యప్పరెడ్డి పాళెం, మూర్తిరెడ్డిపాళెం, కల్లిపేడు, తుమ్మూరు, మర్లపల్లి అన్నమేడు, భీమవరం తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. స్వర్ణముఖి నదిలో రాత్రి, పగలు ఇసుక దందా ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. ఇసుకాసురులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో చిగురుపాడు, మూర్తిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం, మర్లపల్లి తదితర చోట్ల స్వర్ణ ముఖి నది పొర్లుకట్టలు సైతం ధ్వంసం చేసి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. కొందరు ఏకంగా అటవీ ప్రాంతాల్లో ఇసుక డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో లారీల్లో ఇసుకను తమిళనాడుకు చేరవేస్తున్నారు. స్వర్ణముఖి నదికి ట్రాక్టర్లు వెళ్లకుండా పలు చోట్ల అధికారులు వేసిన అడ్డుకట్టలను సైతం ధ్వంసం చేశారు. చిగురుపాడు గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలిస్తున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. స్వర్ణముఖి నదిలో బావులు, గుంతలు, అగాధాలు ఏర్పడ్డాయి. నదిలో ఉన్న తాగు నీటి పథకాలతోపాటు సాగు నీరు అందని పరిస్థితులు తలెత్తుతాయని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణా దందాపై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.





ఇసుకాసురులు తెగ్గొట్టిన నది పొర్లు కట్ట, అగాధాలుగా మారిన స్వర్ణముఖి నది

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించండి

వెంకటగిరి రూరల్ : ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ పయనించాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎల్ఎస్ పంక్షన్ హాల్‌లో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఆటోలతో పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.

వెదురుపట్టులో అంగన్‌వాడీ అస్తవ్యస్తం





ఎస్టీ కాలనీలో ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం, వెదురుపట్టులో వృథాగా ఉన్న భవనం

దొరవారిసత్రం: మండలంలోని వెదురుపట్టు పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ భవనాల వినియోగం అస్తవ్యస్తంగా మారింది. వెదురుపట్టులో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఉంది. అయితే గ్రామంలో కేవలం ముగ్గురు పిల్లలే అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీలో 10 మంది పిల్లలు ఉన్నప్పటికీ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని అంగన్‌వాడీ కేంద్రానికి రాలేకపోతున్నారన్న కారణంతో కొన్ని నెలల కిందటే వెదురుపట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎస్టీ కాలనీలోని ఓ అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలోని పిల్లలు ఎస్టీ కాలనీకి వెళ్లలేకపోతున్నారని గ్రామస్తులు తెలియజేశారు. గ్రామంలో నిరుపయోగంగా మారిన అంగన్‌వాడీ భవనం కాంట్రాక్టర్లకు, రైతులకు గోదాముగా మారింది. అదే విధంగా వెదురుపట్టు రాజుపాళెం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ భవన నిర్మాణం పదేళ్ల నుంచి మొండి గోడలకే పరిమితమైంది. దీంతో ఈ కాలనీలోనే ఓ అద్దె ఇంటిలో కేంద్రాన్ని పది మంది పిల్లలతో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. మొండి గోడలకు పరిమితమైన భవనం గోడలు, కమ్మి క్రమేపి దెబ్బతింటూ వస్తోంది. దీన్ని ఇలాగే వదిలేస్తే ఎందుకు పనికి రాకుండాపోతుందని కాలనీవాసులు వాపోతున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భవతులు, బాలింతలు కేంద్రం ద్వారా అందించే పోషకాహారాన్ని క్రమం తప్పక తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ సూచించారు. మండల కేంద్రంలోని దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలింతలు, గర్భవతులకు పోషకాహారంపై అవగాహన కల్పించే క్రమంలో పోషణ్ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసూనా, కమల, హెల్పర్ భవాని, ఆశా సుజాత పాల్గొన్నారు.

వెంకటగిరిలో కుండపోత

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో శనివారం కుండపోత వర్షం కురిసింది. తెల్లవారు జామున నుంచి ఎడతెరపిలేకుండా మూడు గంటలకు పైగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు వెనుకాడారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక గూడూరు– వెంకటగిరి రోడ్డు మార్గం గుంతలమయం కావడంతో వర్షపు నీరు చేరింది. ఆ మార్గం కుండా రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బంగారుపేట తెలుగుగంగ కాలువ వంతెన వద్ద నిల్వ ఉన్న వర్షపునీరు

ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి



నిమ్మ పంటల సాగుకు భూమిని పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి

దక్కిలి: ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలని వెంకటగిరి ఉద్యానశాఖాధికారి ఆనంద్‌రెడ్డి కోరారు. మండలంలోని మహసముద్రం గ్రామాల్లో రైతులు సాగు చేసేందుకు సిద్ధం చేసి ఉన్న పొలాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలకు ఉద్యాన శాఖలో విస్తరణ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు తమ పొలానికి సంబంధించిన 1బీ, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ బుక్ దరఖాస్తు తీసుకుని ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ



స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవను అర్చకులు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో వేంచేపు చేసి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా నిర్వహించారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



డిజిటల్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ అందుబాటులోకి తీసుకుని వచ్చిన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను శనివారం చిల్లకూరు మండలం, మోమిడి గ్రామంలో పార్టీ మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలనతో పాటుగా దాడులు, అక్రమ కేసులు ఇలాంటి వాటి నుంచి రక్షణ కల్పించేలా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డిజిటల్ బుక్‌ను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ నందవరం సుబ్బారావు, వీంపీటీసీలు పోలుబోయిన చెంగయ్య, పాలూరు మాధవి, ఎల్లసిరి జానకిరామ్, సీనియర్ నాయకులు ఓడూరు బాలకృష్ణారెడ్డి, దువ్వూరు చెంచు కిరణ్‌రెడ్డి, మల్లి రమేష్, జోగి అంకారావు, మండల మహిళా విభాగం నాయకురాలు, పర్వతాల లలిత, చక్రపాణిరెడ్డి, ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



నేలకొరిగిన తాటిచెట్లు

బాలాయపల్లి(సైదాపురం): వాతావరణ మార్పుల్లో శనివారం ఉదయం కురుసిన వర్షానికి మండలంలోని పొకపూడి గ్రామం తాటిచెట్లు సమీపంలోని విద్యుత్ స్తంభంపై పడ్డాయి. ఆ సయమంలో ప్రజలు ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఫల సాయం అందలేదని గిరిజనుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని చిలమనూరు గ్రామానికి చెందిన గిరిజనులకు అటవీశాఖ అధికారులు వన సంరక్షణ సమితి ఫల సాయం ఇవ్వలేదని శనివారం నిరసన తెలిపారు. గిరిజనులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వన సంక్షణ సమితి సభ్యులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. జామాయిల్ చెట్ల విక్రయించిన నగదు ఇంత వరకు తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని చిలమనూరు గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి సభ్యులకు ఫలసాయం ఇచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అక్రమ కట్టడం తొలగింపు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని మేల్చూరు గ్రామ సర్వే నెంబర్ 8లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని న్యాయస్థానం ఆదేశాల మేరకు తహసీల్దార్ విజయలక్ష్మి, సీఐ ఏపీ రమణ, ఎస్ఐ గోపి సమక్షంలో శనివారం తొలగించారు. అధికారులు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి అక్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆ అక్రమ కట్టడం తొలగించమని కోర్టు ఆదేశించడంతో చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.

ఇంటింటికీ జీఎస్టీ కరపత్రాల పంపిణీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య ఆదేశాల మేరకు పురపాలక సంఘం పరిధిలో శనివారం సాయంత్రం జీఎస్టీ 2.0 కరపత్రాలు, బ్రోచర్లును ఇంటింటితో పాటుగా అన్ని దుకాణాల వారికి అందజేశారు. ముఖ్యంగా కొత్తగా అమలు చేసిన జీఎస్టీ వస్తువులకు సంబంధించి ప్రజలకు జీఎస్టీ లేకుండా అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోట: విషపు గుళికలు తిని చెన్నైలో చికిత్స పొందుతూ రాఘవాపురానికి చెందిన రవిచంద్ర(45) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాఘవాపురానికి చెందిన రవిచంద్ర గత నెల 26న ఆత్మహత్యకు యత్నించగా చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సూళ్లూరుపేటలో స్పేస్ వాక్



స్పేస్‌వాక్‌ను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ వారి ఆధ్వర్యంలో శనివారం సూళ్లూరుపేట పట్టణంలో స్పేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి హోలీక్రాస్ సెంటర్ మీదుగా డీటీఎస్ కాలనీ వరకు నిర్వహించిన స్పేస్ వాక్ కార్యక్రమాన్ని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. షార్ అధికారులు ఇప్పటిదాకా ప్రయోగించిన రాకెట్లు, భవిష్యత్తులో ప్రయోగించబోయే మానవ సహిత ప్రయోగ రాకెట్ హ్యూమన్ రేటెడ్ లాంచింగ్ వెహికల్ (హెచ్‌ఆర్ ఎల్‌వీ) నమూనాను ప్రదర్శించారు. ఇదే చూపరులను ఆకట్టుకుంది. షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చైళియన్, కంట్రోలర్ రమేష్‌బాబు, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, అన్ని విభాగాలకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం



చిల్లకూరు: మండలంలోని తీపనూరు గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై శనివారం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు గ్యాంగ్ మెన్ గుర్తించి గూడూరు జీఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన రావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి సుమారు 38 ఏళ్ల వయసు ఉంటుందని, బ్రౌన్ టీ షర్టు, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు.

గాయపడ్డ వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పేర్నాటి సుందరం (68) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బిరదవాడ గ్రామానికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి సుందరం నాయుడుపేటకు వచ్చి తిరిగి వెళుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుందరాన్ని చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న కంటైనర్ : ఒకరికి తీవ్ర గాయాలు



లారీలో చిక్కుకు పోయిన డ్రైవర్ వీరమణి

తడ: లారీని వెనక నుంచి కంటైనర్ ఢీ కొనడంతో కంటైనర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, నాయుడుపేట నుంచి ధాన్యంలోడుతో తమిళనాడులోని తిరుచ్చికి వెళుతున్న లారీ తడ కండ్రిగ వద్ద ఉన్న నిప్పో పరిశ్రమ వద్దకు వచ్చే సరికి డీజిల్ అయిపోవడంతో అకస్మాత్తుగా రోడ్డుపై ఆగిపోయింది. అదే సమయంలో ఒంగోలు నుంచి చెన్నై పోర్టుకు గ్రానైట్ లోడుతో వెళుతున్న కంటైనర్ ఆ లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లిపోయింది. కంటైనర్ డ్రైవర్ వీరమణి రెండు లారీల మధ్య చిక్కుకుపోయాడు. వెంటనే స్పందించిన స్థానికులు, హైవే సిబ్బంది, పోలీస్ సిబ్బంది రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి లారీల మధ్య చిక్కుకు పోయిన డ్రైవర్‌ని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాలు తీవ్రంగా నలిగి పోవడంతో చెన్నైకి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కొండపనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పనులు.. తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం



కొత్తపాళెంలో దెబ్బతిన్న నీటి సరఫరా పైపు

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల కారణంగా కొత్తపాళెంకు నీటి సరఫరా చేసే పైపులైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత నేదురుమల్లి హరీష్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఊనుగుంటపాళెం, విద్యానగర్, కొత్తపాళెం మీదుగా సాగరమాల రోడ్డు పనులు జరుగుతున్నాయి. విద్యానగర్ నుంచి కొత్తపాళెం వరకు భారీ యంత్రాలతో పనులు చేస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతున్న మార్గంలో పీడబ్ల్యూఎస్ స్కీమ్, పైలట్ ప్రాజెక్ట్ సమగ్ర మంచినీటి పథకాలకు సంబంధించిన పైపులైన్లు ఉన్నాయి. గత 5 నెలల్లో అనేక పర్యాయాలు పైపులైన్లు దెబ్బతినడంతో లక్షలాది రూపాయలు పంచాయతీ నిధులు వెచ్చించి మరమ్మతులకు ఖర్చు చేసినట్లు హరీష్‌చంద్రారెడ్డి తెలిపారు. అధికారులు విచారించి న్యాయం చేయాలన్నారు. సాగరమాల అధికారులు కొత్త పైపులైన్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆ గుంతలకు మట్టి పోయండి మహాప్రభో!

- వాడీవేడిగా సైదాపురం మండల సమావేశం



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న తిరకాల భాస్కర్

సైదాపురం: రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయ్.. గుంతలకు తట్టమట్టి పోయించండి సారూ.. లేకపోతే రోజు ప్రమాదాలు జరుగుతున్నాయ్.. పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ అధికారులపై మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సమావేశాన్ని ఎంపీడీఓ ఎంవి రామ్మోహన్‌రెడ్డి నిర్వహించారు. సమావేశంలో సభ్యులు పలు ప్రశ్నలతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అడుగుకో గుంత ఉండటంతో ఆమార్గంలో రాకపోకలు కొనసాగించాలంటే ప్రజలు హడలిపోతున్నారని చెప్పారు. ఈవిషయమై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. ఊటుకూరు గ్రామంలో ఉన్న పశువైద్యశాలకు వైద్యులు లేకపోవడంతో పాడిరైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పాలూరు ఎంపీటీసీ సభ్యులు ముప్పాళ్ల ఈశ్వరరాజు మాట్లాడుతూ కరెంట్ పోతే ఫీజు వేసే వారు లేకుండా పోతున్నారన్నారు. 50 కుటుంబాల వారికి ఇప్పటి వరకు రేషన్ స్మార్ట్‌కార్డులు అందలేదని చెప్పారు. అనంతమడుగు ఎంపీటీసీ లేబాక వెంకటరమణయ్య మాట్లాడుతూ సమావేశాలకు వచ్చే అధికారులు, సమస్యలను పరిష్కరించిన దాఖలాల్లేవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీలు తిరకాల భాస్కర్, పాలూరు ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరరాజు, అనంతమడుగు వెంకటరమణయ్య, చాగణం ఎంపీటీసీ సుమతి, సైదాపురం ఎంపీటీసీ శిరసంబేటి పద్మమ్మ, రామసాగరం ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, మర్లపూడి ఎంపీటీసీ శ్రీనివాసులు, సొసైటీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఏపీఎం రాధరెడ్డి, ఏఈలు మనోజ్, జయరామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తూతూమంత్రం.. మండల సమావేశం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోట: ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. దీనికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన అధికారులు కూడా తూతూ మంత్రంగా తమ శాఖల పనితీరును, చేస్తున్న పనులను వినిపించిన వెంటనే సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా సాగుతాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.